క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న మా ఫౌండేషన్ నిర్వాహకులు

గరిడేపల్లి : మండల పరిధిలోని తాళ్లమల్కాపురంలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మామిడి ఆశ్రిత పుట్టినరోజు సందర్భంగా గురువారం మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేట్లు, స్పూన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మా ఫౌండేషన్ నిర్వాహకులు మామిడి సౌజన్యలక్ష్మణ్‌గౌడ్‌ను ప్రధానోపాధ్యాయుడు గోవింద్‌నాయక్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరస్వామి, రంగయ్య, మండవ వెంకటేశ్వర్లుగౌడ్, నందిపాటి సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటు నారాయణరావు మృతి బాధాకరం



పోటు నారాయణరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : రిటైర్డ్ మండల విద్యాధికారి పోటు నారాయణరావు మృతి బాధాకరమని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. గురువారం గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామానికి చెందిన నారాయణరావు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పూర్వ విద్యార్థులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వక్కవంతుల పార్థసారథి, చామకూరి వీరయ్య, మేకల కనకారావు, పోటు రవికుమార్, సుధాకర్, సత్యనారాయణ, సైదులు, వెంకటరమణ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితేనే విజయం



గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిలుకూరు : విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంతో చదివితేనే విజయం సాధించొచ్చని ప్రధానోపాధ్యాయుడు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నారాయణపురంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మోటివేషనల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం జాతీయ స్థాయి రీచార్జ్ ఫెలోషిప్‌కు ఎంపికైన మోటివేషనల్ స్పీకర్ కాకనూని గోపాల్‌రెడ్డిను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాశీనాథ్, విరూపాక్ష, స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ కార్యవర్గం ఎన్నిక

నడిగూడెం : మండలంలోని తెల్లబల్లిలో గురువారం యూత్ కాంగ్రెస్ సమావేశం మండల అధ్యక్షుడు గుండు మహీందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బడేటి వినోద్, ఉపాధ్యక్షుడిగా నెమ్మాది బాబు, ప్రధాన కార్యదర్శిగా చేకూరి సుమన్, కార్యదర్శిగా గడ్డం వినోద్, కోశాధికారిగా విమలపంగు ఉపేందర్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పగిళ్ల ఉపేందర్, తెల్లబల్లి సహకార సంఘం వైస్ చైర్మన్ కొల్లు వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

1న మాదిగ అమరవీరులకు నివాళులు అర్పించాలి

మునగాల : మాదిగ సోదరుల త్యాగ ఫలితంతోనే ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమైందని, భావితరాలకు న్యాయం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన ప్రతిఒక్కరికీ గ్రామాల్లో మార్చి 1వ తేదీన ఘన నివాళులర్పించాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య మాదిగ కోరారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాత కొట్ల నాగరాజు, ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్లపల్లి అంజయ్య మాదిగ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : మండలంలోని కరివిరాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులు చేపడుతున్నందున సబ్‌స్టేషన్ పరిధిలో కరివిరాల, చెన్నకేశ్వాపురం, కాగితరామచంద్రాపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కె. సైదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిలుకూరు మండలంలో..

చిలుకూరు : మండలంలోని బేతవోలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, బేతవోలు ఫీడర్ లైన్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బేతవోలు, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం, జెర్రిపోతులగూడెం, పోలేనిగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామిశెట్టి శ్రీనివాస్‌రావు తెలిపారు.

మూడునెలలైనా అసంపూర్తిగా..

- సీసీరోడ్డు నిర్మాణంలో జాప్యం
- కంకర తేలి ప్రమాదాలు
- దుమ్ముతో ప్రజలకు ఇబ్బందులు



మునగాల వద్ద నిలిచిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు

మునగాల : మండల కేంద్రంలోని గణపవరం క్రాస్ రోడ్డు నుంచి గ్రామ శివారు వరకు చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మునగాల –గణపవరం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేసింది. తారు రోడ్డు పనులను కాంట్రాక్టర్ 80 శాతం పూర్తి చేశారు. కానీ మునగాలలో సుమారు 800 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మూడు నెలల క్రితం 800 మీటర్ల పొడువున ప్రస్తుతం ఉన్న రోడ్డును తవ్వి కంకర పరిచి డస్టుతో చదును చేశారు. అనంతరం పక్షం రోజుల క్రితం బీటీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ దారిపై నిత్యం వందలాది ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, ప్రజలు ప్రయాణిస్తుంటారు. కంకర తేలి ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. కంకర రాళ్లు స్లిప్ అయి పలు ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ దారి గుండా పెన్‌పహాడ్ మండలానికి చెందిన ఐదు గ్రామాలు, గరిడేపల్లి మండలానికి చెందిన మూడు గ్రామాలు, మునగాల మండలానికి చెందిన మూడు గ్రామాల ప్రజలు తమ అవసరాల నిమిత్తం మునగాల వచ్చి వెళ్తుంటారు. ఇక ఈ రోడ్డుకు ఇరుపక్కల ఉన్న దుకాణదారులు, ఇళ్ల యజమానులు దుమ్ముతో అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్ సీసీరోడ్డు నిర్మాణంలో తాత్సారం చేస్తున్నట్లు గ్రామ ప్రజలు ఆరోపించారు. యుద్ధ ప్రాతిపదికన సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలి



మండల కేంద్రంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి మూడు నెలలు గడుస్తోంది. అయినా నేటికీ కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదు. కంకర పోసి చదును చేయడంతో నిత్యం దుమ్ము ధూళితో పాటు కంకర తేలి నడిచే వీలులేకుండా పోతోంది. తక్షణమే సీసీ రోడ్డు పనులు పూర్తిచేయాలి.

– చింతకాయల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు

ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రెండు నెలలుగా నానా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై కంకర తేలడంలో ఆటోలు మరమ్మతులకు గురవుతున్నాయి. వీలైనంత త్వరలో సీసీరోడ్డు పనులు పూర్తిచేయాలి.

– గంధం అంకమరావు, ఆటోడ్రైవర్, మునగాల

మార్చి మొదటి వారంలో ప్రారంభిస్తాం



మునగాలలో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నది వాస్తవమే. పది రోజుల క్రితమే బీటీరోడ్డు వేసి మూడు రోజుల పాటు రోలర్‌తో చదును చేయించాం. మార్చి మొదటివారంలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పదిరోజుల్లో పూర్తి చేస్తాం.

– బి.సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ, మునగాల

దరఖాస్తులపై పునర్విచారణ చేయాలి

- ఆర్డీఓ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

మఠంపల్లి : మండలంలో పైలట్ గ్రామంగా ఎంపికైన రఘునాథపాలెంలో గత ఏడాది నిర్వహించిన ప్రజాపాలనలో వచ్చిన 2220 దరఖాస్తులపై పకడ్బందీగా పునర్విచారణ చేపట్టాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాపాలన దరఖాస్తుల పునర్విచారణకు తహసీల్దార్, ఎంపీడీఓతో పాటు మరో ఐదుగురు మండల స్థాయి ఇంజనీరింగ్ అధికారులతో మొత్తం ఏడు టీమ్‌లుగా ఏర్పాటు చేస్తున్నామని, వారికి సహాయ అధికారులుగా ఒక్కొక్క టీమ్‌కు ముగ్గురు చొప్పున 21 మంది పంచాయతీ కార్యదర్శులను నియమిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ మంగా, ఎంపీడీఓ జగదీష్‌కుమార్, మండల స్థాయి ఇంజనీరింగ్ అధికారులు ఎస్.జయచంద్ర, ఎస్‌కె.ఫయాజ్, మాదవనాయుడు, కిరణ్‌కుమార్, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా కమిటీలో నేరేడుచర్ల వాసులు



నియామకపత్రాలతో ఆర్యవైశ్య సంఘం నేతలు

నేరేడుచర్ల : ఆర్యవైశ్య సంఘం సూర్యాపేట జిల్లా కార్యవర్గంలోకి నేరేడుచర్ల నుంచి 21 మందికి స్థానం కల్పించారు. ఈమేరకు గురువారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు వారికి నేరేడుచర్లలో నియామకపత్రాలు అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా రాచకొండ రాంమోహన్‌రావు, రాచకొండ శ్రీనివాస్‌రావు, పోలా విశ్వనాథం, తడకమళ్ల నర్సింహస్వామి, భువనగిరి అంజయ్య, రాచకొండ నాగ మాధవరావు, కందిబండ శ్రీనివాస్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శులుగా ఊట్కూరి నటరాజ్, మాశెట్టి సైదయ్య, నీలా శ్రీనివాస్, గోళ్ల సుధాకర్, ఈగా శ్రీనివాస్‌రావు, కొత్త లక్ష్మణ్, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఉప్పుల పుల్లయ్య, గజ్జల కోటేశ్వర్‌రావు, మురారిశెట్టి రమేష్, సత్యనారాయణ, యాదా ఎల్లయ్య, అశోక్, యోగానందం నియమితులయ్యారు.

ప్రజలపై పరమశివుని ఆశీస్సులు ఉండాలి

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



మేళ్లచెరువులో లైటింగ్ ప్రభలను ప్రారంభించి మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

మేళ్లచెరువు : పరమశివుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఆకాంక్షించారు. మేళ్లచెరువు మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లైటింగ్ ప్రభలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, మండల నాయకులు శంకర్‌రెడ్డి, బాల వెంకటరెడ్డి, వర్రా వెంకటరెడ్డి, జనిగ సైదులు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



హుజూర్‌నగర్‌లో ఓటు వేసి సిరా గుర్తు చూపుతున్న మహిళా ఓటరు



కోదాడలో పోలింగ్ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన బ్యానర్‌ను తీయిస్తున్న తహసీల్దార్

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో గురువారం జరిగిన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. నియోజకవర్గంలో మొత్తం 463 మంది ఓటర్లు ఉండగా వారిలో 440 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 95.03 శాతం పోలింగ్ నమోదైంది. హుజూర్‌నగర్‌లో 185 మంది ఓటర్లకు గాను 178 మంది ఓటు వేశారు. గరిడేపల్లిలో 94 మంది ఓటర్లకు గాను 89 మంది ఓటు వేశారు. మఠంపల్లిలో 34 మంది ఓటర్లకు గాను 34 మంది, నేరేడుచర్లలో 95 మంది ఓటర్లకు గాను 88 మంది ఓటు వేశారు. పాలకవీడులో 22 మంది ఓటర్లకు గాను 20 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మేళ్లచెరువులో 21 మంది ఓటర్లకు గాను 20 మంది, చింతలపాలెంలో 12 మంది ఓటర్లకు గాను 11 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒక్కో పోలింగ్ కేంద్రం వద్ద ఆరుగురు పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీఓ

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాస్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ మంగా, ఆర్‌ఐ జానీపాష తదితరులు ఉన్నారు.

మునగాలలో..

మునగాల : మునగాలలోని 150వ కేంద్రంలో గురువారం వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరిగింది. అందులో 65 ఓట్లు ఉండగా 56 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు మండల తహసీల్దార్ వి.ఆంజనేయులు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో 102 ఓట్లకు గాను 97 ఓట్లు పోల్ అయినట్లు తహసీల్దార్ ధ్రువ్ కుమార్ తెలిపారు. కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. కోదాడ ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్ ఆధ్వర్యంలో చిలుకూరులో బందోబస్త్ నిర్వహించారు.

కోదాడ డివిజన్‌లో 95.22 శాతం పోలింగ్

కోదాడ : కోదాడ రెవిన్యూ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పోలింగ్ కేంద్రాల సమీపంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు టెంట్లు వేసి తమ అభ్యర్థులకే ఓటు వేయాలని అభ్యర్థించడం కనిపించింది. డివిజన్‌లో మొత్తం 712 మంది ఓటర్లకు గాను 678 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని, ఓటింగ్ శాతం 95.22గా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

అనంతగిరి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో 25 ఓట్లకు గాను 24 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ కే. హిమబిందు తెలిపారు.

మోతె : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో గురువారం 48 మంది ఓటర్లకు 44 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారిని నాగలక్ష్మి తెలిపారు. మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మోతె ఎస్సై యాదవేందర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. మోతె ఆర్‌ఐలు, ఎన్నికల సిబ్బంది ఎన్నికల విధులు నిర్వర్తించారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో గురువారం 92 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారి బి.రాజు తెలిపారు. మొత్తం 48 మంది ఓటర్లకు గాను 44 మంది ఉపాధ్యాయులు ఓటు వేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దారు సరిత పర్యవేక్షించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అన్నదానం



మునగాల : అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. బుధవారం రాత్రి శ్రీగోవిందమాంబ సమేత జగద్గురు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇనుగుర్తి వీరాచారి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ముత్యాల సత్యనారాయణ, ప్రధాన అర్చకుడు బాణాల లక్ష్మణాచార్యులు, కమిటీ సభ్యులు అనంతోజు సుభాష్‌చంద్రబోస్, ముత్యాల కృష్ణ, వెలిది వెంకటప్పాచారి, బంగారపు శ్రీనివాస్, ముత్యాల వెంకటేశ్వర్లు, ముత్యాల మంగమ్మ, సంధ్య, గోవిందమ్మ, సుజాత పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో గురువారం మండల కేంద్రానికి చెందిన చెక్కా కిశోర్ – వాసవీ దంపతుల 14వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

మైనర్ కాల్వకు నీటిని విడుదల చేయాలి

నడిగూడెం : మండలంలోని కరివిరాలలో పంట పొలాలకు వచ్చే మైనర్ కాల్వకు ఎల్–35 ఎత్తిపోతల పథకం నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. కరివిరాలలో నీరు లేక బీటలు వారిన పొలాలను గురువారం వారు పరిశీలించి మాట్లాడారు. గత కొద్ది రోజులుగా మైనర్ కాల్వకు నీటిని విడుదల చేయక పోవడంతో చేతికొచ్చే దశలో ఉన్న పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నక్క చంద్రం, మస్తాన్, నరేష్, రసూల్ పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



గరిడేపల్లి : కీతవారిగూడెంలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న పూజారులు



కోదాడరూరల్ : తొగర్రాయిలో స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయిలో ప్రాచీన భ్రమరాంభ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి పార్వతీపరమేశ్వరుడి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని పల్లకీలో, స్వామివారిని నంది వాహనంపై ఆశీనులు చేసి దివిటీ ఉత్సవం, ఎదుర్కోళ్ల మహోత్సవం, ఊరేగింపు జరిపి కల్యాణ వైదిక క్రతువును అర్చకులు రెంటాల పుల్లేశ్వరశర్మ ఆధ్వర్యంలో కనుల పండువగా జరిపారు. యాదా శ్రీనివాసరావు– మీనా, ఉపేందర్ –సంగీత, గుండపనేని వెంకట సత్యనారాయణ– సునీత, కుక్కడపు కోటేశ్వరరావు– కవిత దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల స్వామి ఆలయ చైర్మన్ అమరనాయని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణ, బుడిగెం నాని, ప్రభాకర్‌రావు, నందుల లక్ష్మీనరసింహశాస్త్రి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వీరబాబు, కోటేశ్వరరావు, మధు తదితరులు ఉన్నారు.

భీమలింగేశ్వరస్వామి ఆలయంలో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతుల శాంతి కల్యాణాన్ని బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక పైకి పూజారులు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను చేర్చారు. అనంతరం మంగళవాయిద్యాల, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మ వార్ల కల్యాణాన్ని జరిపారు. తొలుత సుందర కాండ పారాయణం చేశారు. నీరాజన మంత్రపుష్పం తదుపరి తీర్థప్రసాదాల వితరణ గావించారు. ఆలయ అధికారులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

బూరుగడ్డలో శివపార్వతుల గ్రామోత్సవం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీనల్లకట్ట సంతాన కామేశ్వరీ సమేత శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం అనంతరం విశేషాలంకరణ, తీర్థప్రసాద వితరణ గావించారు. తదనంతరం స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కీతవారిగూడెంలో..

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో గల శ్రీపార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో స్వామివారికి పూజారులు శ్రీరామశర్మ, భద్రశర్మ అన్నాభిషేకం చేశారు. గురువారం దేవతామూర్తులను నంది వాహనంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.



హుజూర్‌నగర్‌రూరల్ : స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు జుట్టుకొండ చంద్రయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మునగాలలో స్వామివారి శోభాయాత్ర

మునగాల : మండల కేంద్రంలో గురువారం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి స్వామివార్ల కల్యాణం జరిపారు. అదేవిధంగా మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించి గురువారం సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో స్వామిమివార్లకు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



హుజూర్‌నగర్‌లో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



మునగాల : వీరబ్రహ్మేంద్రస్వామి శోభాయాత్ర



హుజూర్‌నగర్ : కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మృతుడి కుటుంబానికి చేయూత



వీరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతగిరి : మండలంలోని ఖానాపురంలో ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కింద పడి మృతి చెందిన గీత కార్మికుడు పోలంపల్లి వీరయ్య గౌడ్ కుటుంబానికి గౌడ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ.42వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. ఆ సంఘం కోదాడ డివిజన్ అధ్యక్షుడు మండవ ఉపేదర్ మాట్లాడుతూ.. గౌడ ఉద్యోగుల సంఘం నుంచి రూ.32 వేలు, ఆర్వీ హాస్పిటల్ సూర్యాపేట తరపున రూ.10 వేలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండా శ్రీనివాస్, బెల్లంకొండ గోవర్ధన్, అమరగాని రాధాకృష్ణ, బెల్లంకొండ రామ్మూర్తి, వెలుగూరి కిరణ్, లింగాల రవి, సురభి శ్రీధర్, లింగాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సంత్ సేవాలాల్ జయంతి

నేరేడుచర్ల : పట్టణంలోని ముత్యాలమ్మ కుంట క్రాస్ రోడ్డులో గల శ్రీరామ్ మోటార్స్ ఆవరణలో ఈనెల 28వ తేదీన నిర్వహించబోయే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని విజయవంతం చేయాలని నిర్వాహకులు భూణావత్ సైదమ్మ, సైదానాయక్, రమావత్ కోటి, పాండునాయక్, రమేష్, హేమ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. సేవాలాల్ జయంతి వేడుకలకు నేరేడుచర్ల, పాలకీడు, గరిడేపల్లి మండలాలకు చెందిన గిరిజనులు భారీగా తరలిరావాలని కోరారు.

సేవాలాల్ జయంతికి అధికారులకు ఆహ్వానం

గరిడేపల్లి : హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో శుక్రవారం జరిగే సేవాలాల్ జయంతి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ మండల అధికారులకు, ప్రజాప్రతినిధులకు గిరిజన సంఘం నాయకులు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. జయంతి ఉత్సవాల్లో భాగస్వాములై విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బాణోతు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సైదానాయక్, హుస్సేన్‌నాయక్, బాణోతు జయరాంనాయక్, శివనాయక్, గోవింద నాయక్, రమేష్, భంగ్యానాయక్, చంద్రశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటు



ఉమామహేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మునగాల : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందపల్లి ఉమామహేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని పార్టీ మండల సీనియర్ నాయకుడు గన్నా నరసింహారావు అన్నారు. మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు అనారోగ్యానికి గురై బుధవారం మృతి చెందారు. గురువారం ఆయన మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ జెండా కప్పి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పనస శంకర్, నాయకులు మోహన్‌రావు, అప్పారావు, వీరయ్య, వసంతరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బాలకోటేశ్వరస్వామి జాతర

నడిగూడెం : మండలంలోని వల్లాపురం రెవెన్యూ పరిధిలో గల పురాతన శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద జాతర వైభవంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా గురువారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు తమ వాహనాలకు పూజలు చేయించారు. జాతరలో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లిలో ఘనంగా ఊరేగించారు. జాతరకు నల్లగొండ, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలతో పాటు మరిపెడ బంగ్లా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు.